క్లుప్తంగా

ఏరియాలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో జూన్‌లో 119 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. జీఎం కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇల్లెందు ఏరియాలో జూన్ నెల బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. జూన్ నెలకు 2.77 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 119 శాతంతో 3.30 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. రైల్వే ద్వారా 0.15 లక్షల టన్నుల బొగ్గు, 0.54 లక్షల టన్నుల బొగ్గు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 2.40 లక్షల టన్నుల బొగ్గు మొత్తంగా 3.09 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు చెప్పారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు తెలిపారు.

హెచ్‌ఎంకు సన్మానం



జరీనాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగూడెంరూరల్: బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం జరీనాను సోమవారం ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో 25 సంవత్సరాలుగా ఉత్తమ సేవలు అందించి బదిలీపై భద్రాచలం వెళ్తున్న హెచ్‌ఎం జరీనాను పాఠశాలలో వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

4న దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ

టేకులపల్లి: భూ సమస్యను తన ఎజెండాగా పైకి తెచ్చిన కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సదస్సు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈనెల 4న జరగనుందని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, ధరావత్ వెంకన్న, బానోతు వెంకట్రాం, కొడెం రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అనంతారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తనమూనాలను సేకరించినట్లు చెప్పారు. హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం సావిత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వనాథం మరణం పార్టీకి తీరని లోటు

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎల్.విశ్వనాథం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. విశ్వనాథం మృతి పట్ల ఎన్డీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, ఆవునూరి మధు, అశోక్‌లు వేర్వేరు ప్రకటనలో దిగ్భ్రాంతి, నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

టేకులపల్లి: విప్లవోద్యమానికి అంకితమై పని చేసిన ఎల్.విశ్వనాథం అకాల మృతి బాధాకరమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి భూక్యా హర్జ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక నేత, కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఎల్.విశ్వనాథం సోమవారం సిద్దిపేటలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రొంపేడు మేజర్ గ్రామపంచాయతీకి ఉపసర్పంచ్‌గా పనిచేసి, సింగరేణి గని కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన విశ్వనాథం ఇకలేరని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

తలుపులు తెరుచుకునేదెప్పుడో?

ఆరు నెలల క్రితం నూతన భవన నిర్మాణం పూర్తయింది. విద్యుత్ పనులు మిగిలిపోయాయి. ఈ క్రమంలో ఎన్నికలు రావటం పాలకులు మారిపోవటం చకచకా జరిగిపోయింది. రూ. కోటితో నిర్మించిన నూతన భవనం నిరుపయోగంగా మారింది. ఇల్లెందు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీకి జనవరిలో వేసిన తాళాలు నేటి వరకు తెరుచుకోలేదు. గంపెడాశలు పెట్టుకున్న నిరుద్యోగులకు ఈ భవనం ఉపయోగపడేనా..? ఇల్లెందు జేకే ఏరియాలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణాన్ని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో నిర్ణయించిన కాల పరిధిలో నిర్మాణం పూర్తి చేశారు. కానీ ప్రారంభం ఎప్పుడు అవుతుందో ఎవరికీ సమాధానం దొరకని మిలియన్ డాలర్ల ప్రశ్న.



జేకే ఏరియాలో డిజిటల్ గ్రంథాలయం

- 'డిజిటల్ లైబ్రరీ'.. నిరుద్యోగుల వర్రీ
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- పోటీ పరీక్షలకు ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

ఇల్లెందు: గ్రంథాలయాల వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. అయినా పాలకులు వీటిని పట్టించుకోవటం లేదు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు ఈ డిజిటల్ లైబ్రరీ ద్వారా ఎంతటి సమాచారం అయినా పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో అవసరమైన సమాచారం ఈ గ్రంథాలయం ద్వారా పొందే మార్గం సులభం కానుంది.

సుదూర ప్రాంతాలకు వెళ్లి లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకునే నిరుద్యోగులు ఇల్లెందులోని 'డిజిటల్ లైబ్రరీ'లో అందుబాటులో ఉన్న పుస్తకాలు, దిన, పక్ష, మాస పత్రికలతో పాటు డిజిటల్ సేవలు కూడా పొంది లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంది.

సదుపాయాలు ఇలా...

ఇల్లెందులో రూ.కోటితో నిర్మించిన డిజిటల్ లైబ్రరీలో రీడింగ్ హాల్, కంప్యూటర్ల గది, బుక్స్ కోసం ప్రత్యేక గది, దిన, పక్ష, మాస పత్రికలు చదువుకునేందుకు హాల్, లైబ్రేరియన్ కోసం గది, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంటాయి. అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు, టీవీలు ఉంటాయి.

పట్టించుకోని ప్రభుత్వం..

గ్రంథాలయాల మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదు. మొక్కుబడిగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆశించినంత ఆదాయం లభించటం లేదు. నెలకు రూ.2 వేలు ఇచ్చి నీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ బిల్లులు, పేపర్లు, పరిశుభ్రత పాటించాలని ఆదేశాలు ఇస్తున్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు చెల్లించే పన్నుల్లో 10శాతం లోపు గ్రంథాలయాల సెస్ ఇవ్వాల్సి ఉంది. ఈ నిధులను గ్రంథాలయాల నిర్వహణ కోసం ఖర్చు చేస్తారు. ఈ నిధులు సక్రమంగా విడుదల చేయకపోవటం వల్ల గ్రంథాలయాలు ఆశించినంతగా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

అధికారులు స్పందించాలి..



డిజిటల్ గ్రంథాలయాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఇల్లెందులో నిర్మాణం పూర్తి చేసుకున్న డిజిటల్ గ్రంథాలయం వెంటనే ప్రారంభించి పోటీ పరీక్షలకు నిరుద్యోగులకు ఉపయోగపడేలా వెంటనే ప్రారంభోత్సవం చేయించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ దిశగా కృషి చేయాలి.
– బయ్యా అభిమన్యు

తక్షణం అందుబాటులోకి తేవాలి..



రూ. కోటి ఖర్చు చేసి నిర్మించిన గ్రంథాలయాన్ని తక్షణమే పాలకులు ప్రారంభించి నిరుద్యోగులకు ఉపయోగపడేలా అన్ని సదుపాయాలు కల్పించాలి. పాత గ్రంథాలయం లోపలికి ఉండటం వల్ల నిరుద్యోగులకు ఉపయోగపడడం లేదు. దీనిని తక్షణం అందుబాటులోకి తీసుక రావాలి.
– కె. పృథ్వీ

నిర్మాణం పూర్తి చేశాం..



ఇల్లెందు డిజిటల్ లైబ్రరీ నిర్మాణం పూర్తయింది. విద్యుత్ కనెక్షన్ పనులు కూడా పూర్తయ్యాయి. కేవలం ఫర్నిచర్ రావాల్సి ఉంది. గ్రంథాలయ శాఖ వారు పాత భవనం నుంచి మెటీరియల్, బుక్స్ తరలిస్తే ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం.
– సాలార్, ఏఈ, ఐటీడీఏ, ఇల్లెందు

ప్రభుత్వ విద్యను కాపాడాలి



మాట్లాడుతున్న హరీశ్

టేకులపల్లి: ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు హరీష్ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల్ని చైతన్య పరుస్తూ జిల్లా వ్యాప్తంగా తిరుగుతున్న క్రమంలో సోమవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేడు కార్పొరేట్ కబంధ హస్తాల్లో నలిగిపోతున్న విద్యను కార్పొరేట్ విద్యా సంస్థల నుంచి కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యను ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని నేటి సమాజంలో ఉన్న పరిస్థితుల్లో కార్పొరేట్ సీట్ల కోసం ఎగబడి ఈ తరువాత ఫీజులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో ఒక్కసారి తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. రూ.లక్షలు వెచ్చించి విద్యార్థుల భవిష్యత్‌ను బట్టీ చదువులు కాకుండా ప్రభుత్వ విద్య వైపు ఆలోచన చేయాలని పేర్కొన్నారు. అనుభవం గల ఫ్యాకల్టీలను నియమించి అధునాతనమైన ల్యాబ్స్, బిల్డింగ్ అన్ని సౌకర్యాలను కల్పిస్తున్న ప్రభుత్వ కాలేజీలు, కేజీబీవీ కాలేజీల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, పీటర్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ

జూలూరుపాడు: స్థానిక సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం నుంచి వరి (బీపీటీ 5204) విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 కిలోల బస్తా రూ.1033 అని తెలిపారు. ఆధార్ కార్డ్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ ఇచ్చి విత్తనాలు పొందవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదం..

ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో ఇల్లెందు, మహబూబాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలు... ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన తిరుమలేష్, లింగరాజు బైక్ వస్తూ మహబూబాబాద్ నుంచి ఇల్లెందు వైపు వస్తున్న కారును ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి..

జూలూరుపాడు: గుండెపుడి గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. నరేష్ తీవ్రంగా గాయపడటంతో అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు... రాత్రి నరేష్ మద్యం సేవించి అరుస్తుండటంతో ఎదురింటి వెంకటేశ్వర్లు బయటకు వచ్చాడు. తననే తిడుతున్నాడని అనుమానంతో నరేష్‌ను కర్రతో వెంకటేశ్వర్లును విచక్షణా రహితంగా కొట్టాడు. ఈ దాడిలో నరేష్ రెండు కాళ్లు, రెండు చేతులు విరిగిపోవడంతోపాటు, ఛాతీపై కూడా గాయాలైనట్లు చెప్పారు. నరేష్ కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు వచ్చే సరికి వెంకటేశ్వర్లు పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ నరేష్‌ను కుటుంబసభ్యులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. సోమవారం చైర్‌పర్సన్‌పారిశుద్ధ్య పనులపై మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్, ఫాగింగ్, స్ప్రే చేయించాలని సూచించారు. రోడ్ల మీద తిరిగే ఆవులను గోశాలకు తరలించాలన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో పందుల పెంపకం యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ శేషాంజన్‌స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎమ్.అశోక్, కె.వీరభద్రచారి, శానిటేషన్ జవాన్లు నవీన్, లక్ష్మణ్, సలీం, ప్రభుదాస్, రాజేష్, శ్రీహరి పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటాం..

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలోని బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ సీ.త్యాగరాజన్ అన్నారు. సోమవారం పోస్టాఫీస్ సెంటర్‌లోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాల హయాంలో 13 మంది బీఆర్‌ఎస్ ఎంపీలు 2015లో ఎంఎండీఆర్ యాక్ట్ 17(ఏ)కు సానుకూలంగా ఉండి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలకు కట్టుబడి ఉంటుందని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం మీద ఉద్యమానికైనా సిద్ధమన్నారు. ఎండీ రజాక్, పీతాంబరం, ఆల్బర్ట్, జే.వెంకటేశ్వర్లు, అభిషేక్, భీముడు, పోశం శ్రీనివాస్, సమ్మయ్య, సత్తార్ పాష, చిలక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జిలతో నిరసన... బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొత్తగూడెం ఏరియాలో టీబీజీకేఎస్ నాయకులు జీకేఓసీ, మైన్స్, ఇతర డిపార్ట్‌మెంట్లలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. అనంతరం ఆయా హెచ్‌ఓడీలకు వినతిపత్రాలు అందజేశారు. టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ... తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, కాగితపు విజయ్‌కుమార్, రవికుమార్, జీఎస్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పూర్ణచందర్, చంద్రశేఖర్, వెంకట్రావ్, ఎస్‌వీ రావు, గణేష్ పాల్గొన్నారు.



సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణికి నష్టం చేకూర్చే బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకొని తీరుతామని, దీనికోసం ఈ నెల 5న కలెక్టరేట్ల ముట్టడితో ఉద్యమం ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ డెలిగేట్ల సమావేశం సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు బావుల ప్రైవేటీకరణ ఓపెన్ టెండర్లలో పాల్గొనకుండా కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. నజీర్, రాజారాం, నూనె శ్రీనివాస్, లచ్చిరాం, బంధం నాగయ్య, ఉడత ఐలయ్య, కుమ్మరి రవీందర్, బొల్లి కొమరయ్య, వడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇల్లెందు: మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టి, ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు టీచర్లు కృషి చేయాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం.తార పేర్కొన్నారు. ఈ మేరకు నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీల్లో నిర్వహించే ప్రీ స్కూల్ నిర్వహణపై ప్రాజెక్ట్ పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ సోమవారం వెంకట్యాతండా అంగన్‌వాడీ కేంద్రంలో ముగిసింది. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 228 మంది టీచర్లు ఉండగా ఆరు బ్యాచ్‌లుగా చేశారు. మొదటి బ్యాచ్‌కు శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... 3–6 సంవత్సరాలు చిన్నారులకు కీలకమైన దశ అని ఈ కాలంలో బోధించే అంశాలు, ఆటపాటలు చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు, జ్ఞాన సముపార్జనకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు తొలి విద్యాలనిలయాలు అని అన్నారు. ప్రీ స్కూల్‌ని బలోపేతం చేసేందుకు, పిల్లల్లో బడికి వచ్చే ఆసక్తి, ఒత్తిళ్లకు గురికాకుండా ఆటపాటలతో చదువుకునే మక్కువ పెంచేలా ప్రియదర్శిని పాఠ్యపుస్తకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం, నీతి కథలు, మంచి అలవాట్లు, సంభాషణ, సృజనాత్మకత వెలికి తీయడం, పఠన, గణిత నైపుణ్యాలు పెంపు, శాస్త్రీయ పరిజ్ఞానం, ప్రకృతి సందర్శన తదితర అంశాలు బోధించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు కవిత, శారద, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల సూపర్‌వైజర్లు అనురాధ, లక్ష్మి, సక్కుబాయి, నిర్మల, విజయకుమారి, ఎండీ.ఖలీదా బేగం, స్వరాజ్యలక్ష్మి, నాగిరెడ్డి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు

మౌలిక వసతులు కల్పించండి..



ఆందోళన చేస్తున్న సున్నం రాజయ్య నగర్ వాసులు

ఇల్లెందు: మండలంలోని సీఎస్‌పీ బస్తీ వద్ద నూతనంగా ఏర్పడిన సున్నం రాజయ్య నగర్‌లో జీవిస్తున్న పేదలకు తాగునీరు, విద్యుత్, రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కమిటీ కోరింది. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించి పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నబీ మాట్లాడుతూ... సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, ధర్నాలు ఆందోళనలు చేశామని తెలిపారు. అయినా అటవీశాఖ అభ్యంతరం పేరుతో కనీస సదుపాయలు కల్పించడం లేదని వాపోయారు. రాందాస్, వైకుంఠం, వెంకన్న, మల్లయ్య, సుజాత, హబీవున్నీసా, రేష్మ పాల్గొన్నారు.

హరితహారానికి సిద్ధం

ఇల్లెందురూరల్: వర్షాలు సమృద్ధిగా కురవడతో హరితహారం పథకం ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఒక్కో గ్రామపంచాయతీలో 20వేల చొప్పున మండలంలోని 29 గ్రామపంచాయతీలలో 5.80 లక్షల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ప్రస్తుతం వాతావరణం మొక్కలు నాటేందుకు అనువుగా ఉండటంతో అధికారులు సంబంధిత పనులపై దృష్టిసారించారు. ముందుస్తుగా రహదారులు, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ, అంగన్‌వాడీ పాఠశాలల్లో మొక్కలు నాటేందుకు అనువుగా గుంతల తవ్వకం పనులకు శ్రీకారం చుట్టారు. పలు గ్రామపంచాయతీలలో ప్రధాన రహదారుల వెంట చావు మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటడం ప్రారంభించారు. ఆయా పనులను మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తూ కార్యదర్శులకు జాగ్రత్తలు సూచిస్తున్నారు.



మామిడిగూడెంలో మొక్క నాటుతున్న పంచాయతీ సిబ్బంది

రైతుల అభిప్రాయం మేరకే 'భరోసా'



టేకులపల్లి: సుక్కాలబోడు రైతు సదస్సుకు హాజరైన రైతులు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు

ఇల్లెందురూరల్: రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా పథకం అమలుపై ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమలు చేస్తోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు తెలిపారు. సుదిమళ్ల రైతు వేదికలో రైతు భరోసా పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు సోమవారం పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అమలు చేసిన రైతు బంధు పథకం స్థానంలో నూతన ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రైతులకు చేయూతనివ్వాలని నిర్ణయించిందని చెప్పారు. అయితే పథకం అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల అభిప్రాయం తీసుకునేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులందరూ తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియచేయాలని సూచించారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. మైదాన ప్రాంత రైతులతో పోల్చుకుంటే ఏజెన్సీ ప్రాంత రైతులు భిన్నమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఏజెన్సీ చట్టాల వల్ల ఈ ప్రాంతంలోని గిరిజనేతర రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలను పొందలేకపోయారని, అటువంటి రైతులకు రైతు భరోసా పథకం వర్తించడం లేదన్నారు. కనీసం బ్యాంకు రుణాలకు కూడా నోచుకోవడం లేదని వాపోయారు. అంతేకాకుండా పది ఎకరాలకు మించి భూమి కలిగి ఉన్నప్పటికి సాగునీటి వనరు సరిగా లేకపోవడం వల్ల దిగుబడి లేక గిరిజన రైతులు కూడా నష్టపోతున్నారని వివరించారు. ఆయా కారణాలతో ఏజెన్సీ, మైదాన ప్రాంత రైతులకు వేర్వేరుగా రైతుభరోసా పథకం అమలు చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు కిన్నెర నర్సయ్య, బండారు శ్రీనివాస్, ఏడీఏ వాసవీరాణి, ఏఓ సతీష్, పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలి

టేకులపల్లి: సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా పథకం అమలు చేయాలని రైతులు కోరారు. సోమవారం బేతంపూడి సహకార సంఘం ఆధ్వర్యంలో సుక్కాలబోడు రైతు వేదికలో నిర్వహించిన రైతు సదస్సులో రైతులు, వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబూరావు, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు మాట్లాడుతూ... రైతులు తమ అభియాప్రాయలు తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కౌలు రైతులకు కూడా ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఏడీఏ పి.వాసవిరాణి, కంభంపాటి శ్రీనివాస్, మైకుమారి, మేనేజర్ విజయ, ఏఓ అన్నపూర్ణ, ప్రేమాచారి, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ల సేవలు వెలకట్టలేనివి..



సింగరేణి(కొత్తగూడెం): మాతాశిశు ఆస్పత్రి ఆర్‌ఎంపీ వీరబాబును సన్మానిస్తున్న దృశ్యం

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వైద్యులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ.. తల్లి బిడ్డకు జన్మనిస్తే డాక్టర్ అదే బిడ్డకు పునర్జన్మనిస్తున్నారు. కనిపించని దేవుడు ఎక్కడ ఉన్నారో తెలియదు కానీ, మనకు వైద్య సేవలందిస్తూ డాక్టర్ వృత్తిని దైవంగా భావిస్తున్న డాక్టర్లే కనిపించే దేవుళ్లన్నారు. వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.
– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ రవిబాబు, తదితరులు



కొత్తగూడెంరూరల్: డాక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న త్రివేణి స్కూల్ డైరెక్టర్



పాల్వంచ: వైద్యులను సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్ ప్రతినిధులు



జూలూరుపాడు: ఆస్పత్రిలో డాక్టర్ వినోద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది